

బాసరలో భక్తుల రద్దీ

బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ వరుసగా రెండోరోజు కొనసాగింది. శనివారం భారీగా భక్తులు తరలివచ్చారు. 8లో▸



ధైర్యానికి ప్రతీక అహల్యాబాయి

రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అహల్యాబాయి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35.5 /26.6

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులపై గురుతర బాధ్యత



మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై గురుతర బాధ్యత ఉందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి బలోపేతం చేయాలని డీఈవో రామారావు సూచించారు. జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో జరుగుతున్న శిక్షణ చివరిరోజు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోని వసతులు, ప్రోత్సాహకాలు, డిజిటల్ తరగతులు, ఏఐ బోధన, క్షేత్ర పర్యటనలు, విజ్ఞాన విహారయాత్రలు, క్రీడలు తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను ఆకర్షించాలని వివరించారు. ప్రధానోపాధ్యాయులు ముఖ్యంగా మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్, అకడమిక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే నాలుగు అంశాలపై పట్టు కలిగి ఉండాలన్నారు. ప్రతీ ప్రధానోపాధ్యాయుడు గ్రామంలోని తల్లిదండ్రులతో, గ్రామ పెద్దలతో, వీడీసీ సభ్యులతో సహకార ధోరణిలో ఉంటూ పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఇందులో అధికారులు నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, డీఆర్పీలు మైసాజీ, పరమేశ్వర్, రాజశేఖర్, విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: నిజామాబాద్‌లో జూన్ 10, 11 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ బాల, బాలికల బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో అభిలాష్(44–46), శ్రీకాంత్(46–48), వినయ్(48–50), శ్రీనివాస్(70–75), బాలికల విభాగంలో నిఖిత(44–46), బి కీర్తన(46–48), ఏ.కీర్తన(48–50), అభినయ(54–57), శ్రావణి(63–66), నక్షత్ర(80+) ఎంపికయ్యారని జిల్లా బాక్సింగ్ సెక్రటరీ చందుల స్వామి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి జిల్లా బాక్సింగ్ అధ్యక్షుడు శ్రీధర్ క్రీడాకారులను అభినందించారు.

5న దుకాణాలకు వేలం

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన ఖాళీగా దుకాణాలకు ఈనెల 5న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పూర్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 95, 101, 102, 104, 106, 109(ఓసీ), 107, 110(బీసీ) దుకాణాలకు వేలం ఉంటుందన్నారు. గురువారం ఉదయం 11.30 గంటలకు ఏఎంసీ కార్యాలయ ఆవరణలో వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు రూ.3 వేలు చెల్లించి దరఖాస్తు ఫారాలు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన ఫారాలను 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో అందించాలని సూచించారు. వివరాలకు 73307 33427, 73307 33429 నంబర్లను లేదా కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

గురువుల అక్షర సేద్యం

- బడుల్లో ప్రవేశాలు పెంచేందుకు టీచర్ల సంకల్పం
- గడపగడపకూ చేరువవుతున్న గురువులు
- ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు..



సేవాలాల్ తండా పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల చిన్నారులకు విద్య అవకాశాలను అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. జిల్లాలో ఈ దిశగా చేపడుతున్న కార్యక్రమాలు, ఆధునిక సౌకర్యాలు, సృజనాత్మక బోధనా విధానాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి.

ఇంటింటి ప్రచారం..

జిల్లాలో ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో ప్రతీ శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నూతన బోధనా విధానాలను వివరిస్తున్నారు. ఈ ప్రచారం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కార్యాచరణ రూపొందించారు. తల్లిదండ్రులతో సంప్రదింపులు, పాఠశాలల సౌకర్యాలను వివరించడం, విద్యార్థుల అభ్యసన అవసరాలను తీర్చడంలో ఉపాధ్యాయుల చిత్తశుద్ధి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తోంది.

ఆధునిక సౌకర్యాలు.. మెరుగైన విద్య

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలను కల్పిస్తున్నాయి. దీంతో విద్యాబోధన మెరుగవుతోంది.

డిజిటల్ విద్య: కంప్యూటర్ ఆధారిత విద్య, ఐఎస్‌పీ ప్యానెల్ బోర్డుల ద్వారా నాణ్యమైన బోధన.

సౌకర్యవంతమైన సౌకర్యాలు: విద్యార్థులకు డెస్కులు, క్రీడా పరికరాలు, రంగులతో అలంకరించిన తరగతి గదులు.

ఏఐ ఆధారిత విద్య: ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనా విధానాలను ప్రవేశపెట్టడం.

పాఠశాల విస్తరణ: విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలను విడతలవారీగా విస్తరించే ప్రణాళిక.

విద్యారంగంలో సామాజిక మార్పు..

ఉపాధ్యాయులు విద్యాబోధనను ఒక బాధ్యతగా భావిస్తేనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయి. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చే శిల్పులుగా ఉపాధ్యాయులు బాధ్యతను ఇష్టంగా స్వీకరించినప్పుడు, వృత్తికి సార్థకత ఏర్పడుతుంది. ఈ దృక్పథంతో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారు.

సమన్వయం, అంకితభావం

జిల్లాలో అనేకమంది ఉపాధ్యాయులు అనుభవం, అంకితభావం, విద్యార్థులతో సమన్వయంతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. మారుమూల గ్రామాలు, గిరిజన తండాలలో కూడా వారు తమదైన శైలితో బోధన చేస్తూ, విద్యార్థులను ఆకర్షిస్తున్నారు. ఇలాంటి ఉపాధ్యాయుల స్ఫూర్తితో మరిన్ని పాఠశాలలు బలోపేతమై, ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆటపాటలతోనే అభ్యసనం..



కృత్యాలు, అభినయపూర్వక బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు ఎల్లన్న(ఫైల్)

భైంసా మండలం వానల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో మ్యాదరి ఎల్లన్న విద్యార్థులకు ఆటపాటలు, క్షేత్ర పర్యటనలు, వర్కింగ్ మోడల్స్ ద్వారా సృజనాత్మక బోధన అందిస్తున్నారు.

వినూత్న బోధన: కంజర వాయిస్తూ, పాటలు పాడుతూ విద్యార్థులను ఆకర్షిస్తూ, అభ్యసన ప్రక్రియను ఆనందమయం చేస్తున్నారు.

ప్రశంసలు: జిల్లా స్థాయి బెస్ట్ ప్రాక్టీస్‌లలో ఎంపికై, హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో తన బోధనా విధానాలను ప్రదర్శించారు.

సమన్వయం: తల్లిదండ్రులు, దాతలు, శ్రేయోభిలాషులతో సమన్వయం ద్వారా పాఠశాల పురోగతికి కృషి చేస్తున్నారు.

మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్..

మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 470 మంది విద్యార్థులు చదువుతున్నారు. గణిత ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ తన బోధనా విధానాలతో విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.

విజయాలు: ఎన్‌ఎంఎంఎస్, గణిత ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థులు రాణిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో 40 మందికి సీట్లు సాధించడం ఈ పాఠశాల ప్రతిష్ఠను చాటుతోంది.

ప్రత్యేక తరగతులు: ఆదివారాలు, సెలవు దినాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రతిభను మెరుగుపరుస్తున్నారు.

గుర్తింపు: శ్రీనివాస్ రాసిన ఆర్టికల్ ఎస్‌సీఈఆర్టీ జర్నల్‌లో ప్రచురితమై, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు.



ఎస్సీఈఆర్టీ ప్రచురించిన జర్నల్ లో మస్కాపూర్ ఉన్నతపాఠశాల ఆర్టికల్ ఇదే(ఫైల్)

సేవాలాల్ తండా పాఠశాల..



తన బోధనావిధానాలను ఉపాధ్యాయులకు వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్(ఫైల్)

లోకేశ్వరం మండలం సేవాలాల్ తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ గ్రామస్తులు, యువజన సంఘాలు, దాతల సహకారంతో పాఠశాలను ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. ఒకప్పుడు కేవలం 10 మంది విద్యార్థులతో నిరాదరణకు గురైన ఈ పాఠశాల, ప్రస్తుతం 60 మందికి పైగా విద్యార్థులతో కళకళలాడుతోంది.

సృజనాత్మక బోధన: స్థానిక లంబాడ గిరిజన భాష గోర్మాటీని నేర్చుకుని, విద్యార్థులకు సన్నిహితంగా బోధన చేస్తున్నారు.

బెస్ట్ ప్రాక్టీస్: జిల్లా స్థాయిలో అత్యుత్తమ బోధనా విధానాలకు ఎంపికై, గణితం, తెలుగు, ఇంగ్లిష్, ఈవీఎస్ పాఠ్యాంశాలను క్రియాత్మకంగా బోధిస్తున్నారు.

సమాజంతో సమన్వయం: గ్రామస్తులు, తల్లిదండ్రులతో నెలవారీ సమావేశాలు నిర్వహిస్తూ, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

ఎస్పీకి సన్మానం



ఉదయ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో జిల్లాలో వివిధ స్థాయిలో పోలీస్ అధికారిగా పనిచేసి మెదక్ జిల్లా పోలీస్ ఎస్పీగా శనివారం ఉద్యోగ విరమణ పొందిన ఉదయ్‌కుమార్‌రెడ్డి దంపతులను రిటైర్డ్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న, సభ్యులు కరీం, జాప రాములు, నజీర్‌అహ్మద్, నిమ్మ రాజేశ్వర్, రిటైర్డ్ సీఐ జాన్ దివాకర్ పాల్గొన్నారు.

రిటైర్మెంట్ వృత్తికే..

నిర్మల్‌టౌన్: రిటైర్మెంట్ అనేది ఉద్యోగుల వృత్తికి మాత్రమే అని, వ్యక్తిత్వానికి కాదని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ చేసిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అంబారావును జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో సత్కరించారు. అంబారావు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో 40 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకుని ఉద్యోగ విరమణ పొందాడన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేంద్రారెడ్డి, ఏవో యూనిస్ అలీ, ఆర్‌ఐలు రామ్‌నిరంజన్, శేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఇళ్లు అద్దెకివ్వొద్దు

భైంసాటౌన్: పట్టణంలో అపరిచితులకు ఎవరూ ఇళ్లు అద్దెకివ్వొద్దని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని నయాబాదిలో శనివారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 54 బైక్‌లు, 8 ఆటోలు, నాలుగు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించినట్లు చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లల మొబైల్ ఫోన్ వినియోగం తరచూ పరిశీలించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పోలీసు శాఖ పని చేస్తుందన్నారు. గంజాయి విక్రయాలపై సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ గోపీనాథ్, ఎస్సైలు గౌసుద్దీన్, గణేశ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జొన్నల పైసలు రాలే

- చెల్లింపుల్లో జాప్యం
- వానాకాలం పెట్టుబడికి ఇబ్బంది



కుంటాల కొనుగోలు కేంద్రంలో జొన్నలను పరిశీలిస్తున్న డీఏవో అంజిప్రసాద్

కుంటాల: శ్రమించి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. అతివృష్టి, అనావృష్టి, వాతావరణ సమస్యలు, తెగుళ్ల బెడద వల్ల పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సవాళ్లను అధిగమించి చేతికొచ్చిన పంటను విక్రయించినా, రైతుల ఖాతాల్లో డబ్బులు సకాలంలో జమ కావడం లేదని జొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పెరిగిన జొన్న సాగు..

ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 40 వేల ఎకరాల్లో రైతులు జొన్న సాగు చేశారు. గతేడాది క్వింటాల్ జొన్నకు రూ.3,180 గిట్టుబాటు ధర ఉండగా, ఈ ఏడాది ప్రభుత్వం రూ.3,371గా నిర్ణయించింది. గిట్టుబాటు ధరలో రూ.191 అదనంగా చెల్లించడం, మంచి దిగుబడి కారణంగా రైతులు జొన్నసాగుకు ఆసక్తి చూపారు.

చెల్లింపుల కోసం..

జిల్లా వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 28 జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా 7,543 మంది రైతుల నుంచి 2,26,583 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి రూ.76.38 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. పంట విక్రయించిన 72 గంటల్లో డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా.. నెల రోజుల తర్వాత కూడా డబ్బులు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం సాగు కోసం పెట్టుబడులు సమకూర్చడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి జొన్నల డబ్బులను తమ ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

అమ్మి నెలరోజులైంది..



గతేడాది మంచి దిగుబడి రావడంతో ఈసారి కూడా జొన్న సాగుచేశా. 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించా. నెల రోజులు అయినా ఇంకా డబ్బులు జమ కాలేదు.

– అందుకని గజేందర్, రైతు, విఠాపూర్

పెట్టుబడికి ఇబ్బంది...



పెట్టుబడి పెట్టి కష్టపడి పంటల సాగు చేస్తున్నాం. పండించిన పంట అమ్ముకునే సరికి కష్టాలు తప్పడం లేదు. జొన్నలను అమ్మిన డబ్బులు రాకపోవడంతో వానాకాలం పెట్టుబడికి ఇబ్బందులు తప్పడం లేదు. త్వరగా డబ్బులు జమ చేయాలి.

– మాలేగాం సీతమ్మ, మహిళారైతు, పెంబికల్ పాడ్

త్వరలో రైతుల ఖాతాల్లో జమ..

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతుల నుంచి జొన్నల కొనుగోళ్లు చేపట్టాం. రైతులకు డబ్బుల చెల్లింపుపై ప్రభుత్వానికి నివేదికలు పంపాం. రైతులు దిగులు చెందొద్దు. రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యే అవకాశం ఉంది.

– ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం

పొగాకు ఆరోగ్యానికి హానికరం

- డాక్టర్ రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో పొగాకుతో కలిగే దుష్పరిమాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు నమలడం, పొగ తాగడం వల్ల ఎన్నో రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగ తాగడం మొదలుపెట్టిన 6 నుంచి 10 సెకండ్లలోపు నికోటిన్ మెదడును చేరుతుందని, దీంతో గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశాలు నాలుగు రెట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహణ అధికారులు నయనారెడ్డి, ఆశిష్‌రెడ్డి, సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, డీపీవో రామచందర్, డీపీహెచ్‌ఎన్‌వో సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో

పొగాకుకు దూరంగా ఉండాలి

నిర్మల్‌టౌన్: పొగాకుకు అందరూ దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో పారా లీగల్ వాలంటీర్లకు పొగాకుతో కలిగే దుష్పరిణామాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజలింగం, పారా లీగల్ వాలంటీర్లు కిషన్‌రావు, లోలం గంగన్న, జనార్దన్, గొజ్జ జనార్దన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో నకిలీ విత్తనాల కట్టడికి అన్ని ఫర్టిలైజర్ దుకాణాలలో సోదాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. జిల్లాలో అన్ని పంటలకు సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు అనధికార విత్తనాలు కొనవద్దని సూచించారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చిందని పేర్కొన్నారు.

మనసు పెట్టి పని చేయండి

- తప్పకుండా మంచి ఫలితాలు
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- మంచిర్యాలలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, రామారావుపటేల్, కలెక్టర్లు కుమార్‌దీపక్, వెంకటేశ్ దోత్రే, రాజర్షిషా, అభిలాష అభినవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా తదితరులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'కలెక్టర్లు మనస్సు పెట్టి పని చేస్తే తప్పకుండా మంచి ఫలితాలు వస్తాయి. డ్యూటీ అంటే డ్యూటీ లాగా కాకుండా ఇష్టంతో పని చేయాలి. గిరిజన ప్రాంతాల్లో విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఏ సమస్యలున్నా చెప్పండి. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు, మంత్రిగా నేను అందరం కలిసి ఒక టీంలాగా పనిచేద్దాం. అభివృద్ధి చేసుకుందాం. మీ ఇంటి ఆడపడుచులాగా జిల్లాకు సేవ చేస్తా..' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వానాకాల సాగు సన్నద్ధంపై మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, రాజర్షిషా, అభిలాష అభినవ్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, మంచిర్యాల, బెల్లంపల్లి, ముథోల్ ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, రామారావు, ఎమ్మెల్సీలు దండే విఠల్, మల్క కొమురయ్య, జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, మోతీలాల్, శ్యామలదేవీ, కాగజ్‌నగర్, ఉట్నూరు సబ్ కలెక్టర్లు శ్రద్ధాశుక్లా, యువరాజ్, గృహ నిర్మాణ, వ్యవసాయ, పౌరసరఫరాల, మార్కెటింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సోమవారం వరకు ముగ్గుపోయాలి

ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి 3,500తోపాటు అదనంగా 12వేల ఇళ్లు, పీవీటీజీలకు ప్రత్యేకంగా ఐదు వేల ఇళ్లు మంజూరు చేశామని, గ్రౌండింగ్‌లో ఆలస్యంపై కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులను మంత్రి సీతక్క అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్లు స్పందిస్తూ అటవీ సమస్య ఉన్నచోట్ల నిర్మాణాలు జరగడం లేదని, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ పరిధిలో ఇసుక కొరత ఉందని, రవాణాకే భారీగా ఖర్చవుతోందని తెలిపారు. సెంట్రింగ్ సామగ్రి అందుబాటులో ఉంచాలని, 600చదరపు అడుగుల కంటే ఎక్కువ నిర్మించుకుంటామని, బాత్రూం, టాయిలెట్లు బయట కట్టుకుంటామని, కొన్ని చోట్ల లబ్ధిదారులకు నిర్మాణంపై ఆసక్తి లేదని వివరించారు. మంత్రి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వచ్చే సోమవారం వరకు వీలైనన్ని ఇళ్లకు ముగ్గు పోయాలని తెలిపారు.

వానాకాలానికి సిద్ధం కావాలి

ముందస్తు రుతుపవనాల నేపథ్యంలో రైతాంగం ముందస్తుగా సాగు చేసేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేయాలని అన్నారు. ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఉన్నాయా? ఇంకా ఎక్కడెక్కడ కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆరా తీశారు. ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో కొనుగోళ్లు సాగుతున్నాయని, తడిసిన ధాన్యం రవాణా చేశామని, ఇంకా కొన్ని చోట్ల వరికోతలే కాలేదని చెప్పారు. ఆదిలాబాద్ కలెక్టర్ మాట్లాడుతూ వరి తక్కువగా ఉన్నా జొన్న పంట అధికంగా దిగుబడి వచ్చినా ఏర్పాట్లు చేశామని తెలిపారు. వరద నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసి ఏ గ్రామంలోనూ ఒక్క కుటుంబానికి కూడా వానలతో నష్టం రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, గర్భిణుల ప్రసవానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, వసతిగృహాలు సిద్ధం చేయాలని, నెలవారీగా సమీక్షలు చేసుకోవాలని తెలిపారు.

3నుంచి భూభారతిలో అర్జీలు

భూభారతితో పైలట్ మండలాల్లో దరఖాస్తులు, పరిష్కారంపై మంత్రి చర్చించారు. కలెక్టర్లు మాట్లాడుతూ సాదాబైనామాతోపాటు రెవెన్యూ, అటవీ సమస్యలు వచ్చాయని అన్నారు. గిరిజనులు ఉచితంగా సాదాబైనామాలకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు ఆదిలాబాద్ కలెక్టర్ మంత్రి దృష్టికి తెచ్చారు. 3నుంచి 20వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామన్నారు.

ఎమ్మెల్యేల గైర్హాజరు

ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశానికి నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్, సిర్పూర్, చెన్నూరు ఎమ్మెల్యేలు, పెద్దపల్లి, ఆదిలాబాద్ ఎంపీలు గైర్హాజయ్యారు. ముగ్గురు ఎమ్మెల్యేలే హాజరై తమ ప్రాంత సమస్యలపై ప్రస్తావించారు.

'ఇందిరమ్మ అమృతం' పంపిణీ

అస్పిరేషనల్ జిల్లా కింద ఎంపికైన ఆసిఫాబాద్ జిల్లాలోని కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గించేందుకు పల్లీలు, చిరుధాన్యాలతో తయారుచేసిన చిక్కీల 'ఇందిరమ్మ అమృతం' పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. అంగన్‌వాడీలు బలోపేతం చేశామని, టీచర్లు పౌష్టికాహారం అందించాలని అన్నారు. జీతం పెంపుపై ఆలోచిస్తున్నామని, రూ.2లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామన్నారు.

కునుకు తీసిన కొమురయ్య



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతుండగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య కూర్చున్న సీటులో కళ్లు మూసుకుని కాసేపు ఓ కునుకు తీశారు. సీరియస్‌గా చర్చ జరుగుతున్న సమయంలో ఇదేంటి అంటూ ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

మా సమస్యలు తీర్చండి: ఎమ్మెల్యేలు

మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే నియోజకవర్గంలో కొనుగోళ్లు పూర్తి చేశామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గుర్తుచేశారు. అటవీ అనుమతుల కారణంగా రోడ్ల నిర్మాణం నిలిచిపోతోందని, ఏళ్లుగా ఎడ్లబండి వెళ్లే దారుల్లోనూ ఇబ్బందులున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ విస్తీర్ణం, ఇసుక లభ్యతపై మంత్రి దృష్టికి తెచ్చారు.

- బెల్లంపల్లి నియోజకవర్గంలో అటవీ భూములపై సమస్య ఉందని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ మంత్రికి తెలిపారు. తమ ప్రాంతానికి అదనంగా నిధులు, ఇళ్ల కేటాయించాలని, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలని కోరారు.
- తమ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోళ్లపై రామారావు పటేల్ మాట్లాడారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో పోడు సాగులో ఇబ్బందులు ఉన్నాయన్నారు. అటవీ అధికారులు సీజన్ ఆరంభంలో రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. సీఎంఆర్ ఇవ్వకుండా మిల్లర్లు, అటు ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ సీఎస్సార్ నిధులతో విద్యాసంస్థల్లో కనీస వసతులు మెరుగుపర్చేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక


వెంకటరమణ


సునీల్‌కుమార్

మందమర్రిరూరల్: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు పురస్కరించుకుని ఏరియాలో ఉత్తమ అధికారిగా వెంకటరమణ(అడిషనల్ జీఎం ఈఅండ్ ఎం), ఉత్తమ ఉద్యోగిగా సునీల్‌కుమార్ (కోల్ కట్టర్, కేకే5)ను సింగరేణి యాజమాన్యం ఎంపిక చేసింది. ఆవిర్భావ వేడుకల్లో సింగరేణి హైస్కూల్ మైదానంలో ఏరియా జీఎం దేవేందర్ చేతుల మీదుగా సన్మానం, ప్రశంసపత్రం అందిస్తారని యాజమాన్యం పేర్కొంది.

108లో ప్రసవం

కడెం: మండలంలోని బాబానాయక్‌తండాకు చెందిన జాదవ్ శ్రీలతకు శనివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. శ్రీలతను అంబులెన్స్‌లో కడెం పీహెచ్‌సీ తరలిస్తుండగా, గండిపోచమ్మ ఆలయ వద్ద నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ సేవా, పైలట్ రాకేశ్ అక్కడే సాధారణ ప్రసవం చేశారు. అనంతరం కడెం పీహెచ్‌సీకి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

సర్దుబాటు ఉత్తర్వులు పునఃపరిశీలించాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను పునఃపరిశీలించాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. మంచిర్యాలలో శనివారం తపస్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతీ తరగతి గదికి ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ


క్యూలో భక్తులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ రెండోరోజు కొనసాగింది. శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. అర్చకులు చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు చేయించారు.కాగా, భక్తులు సమర్పించిన కానుకలు, అక్షరభ్యాసానికి రూ.8 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

దశాబ్దాల కల సాకారం


గోదావరి నదిలో పిల్లర్ల నిర్మాణ పనులు


శివ్వారం వైపు బ్రిడ్జి నిర్మించే ప్రాంతం ఇదే..

- శివ్వారం–మంథని గోదావరిపై కొత్త వంతెన
- రెండు జిల్లాల రవాణా సౌకర్యం మెరుగు
- మారనున్న శివ్వారం రూపురేఖలు
- రూ.125 కోట్లతో వంతెన నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

జైపూర్: శివ్వారం–మంథని గోదావరి నదిపై వంతెన నిర్మాణం ఇక్కడి ప్రజల దశాబ్దాల కల. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల వారి చిరకాల కోర్కె నెరవేరనుంది. గోదావరి అవతలి వైపు ఉన్న మంథనికి, ఇవతలి వైపు ఉన్న శివ్వారం వైపు ఉన్న ప్రాంతాల ప్రజలకు ఓ ప్రత్యేక అనుబంధం అల్లుకుపోయింది. అన్నారం–సుందిళ్ల(పార్వతి) బ్యారేజీలు నిర్మించకముందు ఒక్క వర్షాకాలం తప్ప మిగతాకాలంలో గోదావరి నదిలో తక్కువగా నీరు ఉండడంతో ఎడ్లబండ్లు, కాలినడకన మంథని వైపునకు ఇక్కడి ప్రాంతప్రజలు రాకపోకలు సాగించేవారు. నిత్యం అవసరం ఉన్నా మంథనికి వెళ్లడం అలవాటుగా మారింది. ఇలా వెళ్లడం ద్వారా దూరభారం తగ్గడంతోపాటు కొంత సమయం తగ్గుతుందని వర్షాకాలంలో నదిలో నుంచి ప్రాణాలకు తెగిస్తూ రాకపోకలు సాగించడం ద్వారా ప్రజలు ప్రాణాలు నష్టపోయారు. అనేక ఏళ్లప్రజల పోరాటం ఫలితంగా ప్రభుత్వం వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.125 కోట్లతో మంథని–శివ్వారం గోదావరిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుంది. ఇప్పటికే సర్వే పనులు పూర్తికాగా, గోదావరి నదిలో పిల్లర్ల నిర్మాణానికి పనులు చేపట్టారు. దీంతో ఇక్కడి ప్రాంతప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. కాగా, రెండు జిల్లాల రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.

రూ.125 కోట్లతో..

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం శివ్వారం నుంచి పెద్దపల్లి జిల్లా మంథని మధ్యన రూ.125 కోట్లతో గోదావరి నదిపై ప్రభుత్వం కొత్త వంతెన నిర్మించనుంది. ఇప్పటికే సర్వ నుంచి మొదలుకుని ఎల్కంటి, షెట్‌పల్లి, కుందారం, రొమ్మిపూర్, కిష్టాపూర్, వేలాల, పొనూర్ మీదుగా వరంగల్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు ముమ్మరంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీనికితోడు శివ్వారం గోదావరిపై వంతెన నిర్మించనుండడంతో శివ్వారం, గోపాల్‌పూర్, పొనూర్, వేలాల, కిష్టాపూర్, ఆస్నాద్‌తోపాటు పలు గ్రామాల ప్రజలు మంథని, భూపాలపల్లి, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కరీంనగర్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లడానికి సుమారు 50 కి.మీ దూరభారం తగ్గడంతో సమయం కూడా తగ్గనుంది. గోదావరి బ్రిడ్జి నిర్మాణంతో శివ్వారం మరింత అభివృద్ధి చెందనుండగా మంథనిలో వ్యాపార సంస్థలు అభివృద్ధి కానున్నాయి. ఇక్కడి ప్రాంతప్రజలు వారికి ఏ అవసరం ఉన్నా మంథని వెళ్లి కొనుగోళ్లు చేపడుతారు.

ఎన్నో ఏళ్ల కల..



ఇక్కడి ప్రాంతప్రజలకు అక్కడి ప్రాంత ప్రజలకు ఎన్నో ఏళ్లుగా సంబంధాలు ముడిపడి ఉన్నాయి. నిత్యం ప్రజలు మంథనికి రాకపోకలు సాగిస్తుంటారు. ఎన్నోఏళ్లుగా గోదావరిపై వంతెన నిర్మించాలని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇన్నాళ్లకు ప్రభుత్వం వంతెన నిర్మించడం ప్రజల కల సహకారమైంది.

– ఆవిడపు గణేశ్, శివ్వారం తాజా మాజీ సర్పంచ్

బావిలో పడ్డ ఎలుగుబంటి

- నిచ్చెనతో బయటకు తీసిన ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు


బావిలో ఎలుగుబంటి

బోథ్: సొనాల మండలంలోని సాకెర గ్రామశివారు ఓ వ్యవసాయ క్షేత్రంలో గల బావిలో శనివారం ఎలుగుబంటి పడిపోయింది. నడుస్తూ బావిలో తొంగిచూడగా అందులో పడి అరుపులు వినిపించడంతో కొందరు అక్కడికి వెళ్లి చూశారు. వెంటనే అటవీ అధికారులు, గ్రామస్తులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. గ్రామస్తులు ఓ మంచాన్ని నాలుగు వైపులా తాడు కట్టి బావిలో నుంచి ఎలుగుబంటిని బయటకు తెచ్చే ప్రయత్నం చేశారు. కాగా ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని నిచ్చెనను బావిలోకి దించగా ఎలుగుబంటి పైకి వచ్చే ప్రయత్నం చేసింది. జేసీబీతో నిచ్చెనను పైకి తీసుకురావడంతో ఎలుగుబంటి బయటకు వచ్చి చేనులో పోయింది. దీంతో గ్రామస్తులు, అటవీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామ శివారులోకి ఎలుగుబంటి రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చేనుల్లోకి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు సూచించారు.


ఎలుగుబంటిని బావిలో నుంచి తీసే ప్రయత్నం చేస్తున్న సిబ్బంది

ఎస్టీపీపీలో స్కూల్ నిర్మాణ స్థలం పరిశీలన

జైపూర్: జైపూర్ ఎస్టీపీపీలో నూతనంగా నిర్మించనున్న సింగరేణి సీబీఎస్ స్కూల్ నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులుతో కలిసి ఎడ్యుకేషన్ జీఎం శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. పవర్ ప్లాంటులో ఉన్న ఉద్యోగుల పిల్లల విద్య కోసం స్కూల్ ఏర్పాటు చేయాలని అధికారులు, కార్మిక సంఘాలు కోరగా సంస్థ చైర్మన్ బలరాం ఇటీవల ఆమోదించారు. ఈమేరకు అధికారులు స్కూల్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది విద్యాసంవత్సరం నుంచే తాత్కాలిక భవనంలో స్కూల్ ప్రారంభిస్తామని తెలిపారు. అందుకు తగిన భవనాలను పరిశీలించి, ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. సీఎంవోఏఐ బ్రాంచి ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఏబిటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, డీజీఎంలు ఆజాజుల్లాఖాన్, పంతులా, అజ్మీరా తుకారాం, హెచ్‌ఎం సుందర్‌రావు ఉన్నారు.


పరిశీలిస్తున్న ఎడ్యుకేషన్ జీఎం శ్రీనివాస్

ఆటోబోల్తా పడి బాలుడి మృతి


సుహాన్(ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని అనంతపూర్ గ్రామ సమీపంలో ఆటో బోల్తాపడి బాలుడి మృతిచెందాడు. ఎస్సై సాయన్న, 108 పైలెట్ ఆత్రం ఆశోక్ కథనం ప్రకారం.. ఇచ్చోడ మండలం గుండాల గ్రామానికి చెందిన హర్షద్–సల్మా దంపతులకు కుమారుడు సుహాన్ (13) ఉన్నాడు. సిరికొండ మండలంలోని తమ బంధువుల వద్ద ఉంటూ ఉర్దూ మీడియం స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. మేనమామ షేక్ ఆలాం ప్రతీరోజు ట్రాలీ ఆటో ద్వారా గ్రామీణ ప్రాంతంలోని కిరాణాషాపులకు సరుకులు సరఫరా చేస్తున్నాడు. శనివారం ఆయన సరుకులతోపాటు సుహాన్‌ను వెంట తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. తీవ్రగాయాలైన సుహాన్‌ను 108 అంబులెన్స్ సహాయంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు రిమ్స్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టానికి తరలించారు. కాగా, షేక్ ఆలాం ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

భైంసారూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మాటేగాంలో శనివారం జరిగింది. భైంసారూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్‌కు చెందిన డ్రైవర్ పాడ్ నాందేవ్(39) కంటైనర్ లారీ నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి నిర్మల్ వైపు నుంచి వచ్చి మాటేగాం టోల్ ప్లాజా వద్ద రోడ్డు పక్కన వాహనం పార్క్ చేశాడు. భోజనంచేసి పడుకున్నాడు. వేకువజామున కాలకృత్యాలకు లారీదిగి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమై అక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిడ్డకు జన్మనిచ్చి బాలింత మృతి

- వాంకిడి మండలంలో ఘటన


ఆత్రం అంబుబాయి (ఫైల్)

వాంకిడి: నెలలు నిండకముందే పురిటినొప్పులు రావడంతో బిడ్డకు జన్మనిచ్చిన బాలింత మృతి చెందింది. మండలంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని లింబారావుగూడకు చెందిన మేస్రం రాము, భీంబాయి దంపతుల పెద్ద కూతురు అంబుబాయి(27)ని కాగజ్‌నగర్ మండలం లైన్‌గూడకు చెందిన చిన్నుతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. గర్భం దాల్చిన అంబుబాయి తన తల్లి ఇంట్లో ఉంటోంది. ఇటీవల వాంతులు చేసుకోవడంతో వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. శనివారం ఉదయం కడుపు నొప్పి ఉందనడంతో కుటుంబీకులు అంబులెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వచ్చేలోపే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను సిబ్బంది వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసిఫాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తస్రావం ఎక్కువ కావడంతో చికిత్స పొందుతూ అంబుబాయి మృతి చెందింది. వైద్యుల సూచన మేరకు శిశువును మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

అనారోగ్యంతో శతాధిక వృద్ధుడి మృతి


కుబిడే భీమయ్య (ఫైల్)

వేమనపల్లి: చిన్నతనంలోనే రజాకార్ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న సుంపుటం గ్రామానికి చెందిన కుబిడే భీమయ్య (102) శతాధిక వృద్ధుడు శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు తదితరులు.. మృతదేహంవద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని సింగిల్ విండో చైర్మన్ కుబిడే వెంకటేశం పరామర్శించారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో ఘటన
- మృతుడు ఆదిలాబాద్ జిల్లా దంతనపల్లి వాసి


మహేశ్ (ఫైల్)

తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఊరి చెరువులో శనివారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం దంతనపల్లి గ్రామానికి చెందిన గోనె మహేశ్ (36)గా గుర్తించారు. మహేశ్ తిమ్మాపూర్‌కు చెందిన తుమ్మ లక్ష్మీనారాయణ అల్లుడు. మహేశ్‌కు భార్య మౌనిక, కుమారుడు చరణ్, కుమార్తె శిరీష ఉన్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో మహేశ్, అతని భార్య మౌనిక మధ్య కొన్ని రోజులుగా గొడవ జరుగుతున్నట్లు తెలిసింది. ఇటీవల తిమ్మాపూర్‌లో పంచాయితీలు కూడా నిర్వహించినట్లు సమాచారం. ఈ వివాదాలే మహేశ్ ఆత్మహత్యకు కారణంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ..

బజార్‌హత్నూర్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై లింబాజీ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని వర్త మన్నూర్ గ్రామానికి చెందిన సిడం అర్జున్(30) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందాడు. మద్యం మత్తులో శనివారం ఉదయం తన పంట చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య సిడం విజయలక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా జయప్రకాశ్


జయప్రకాశ్(ఫైల్)

సోన్: తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని న్యూవెల్మల్ వాసి అసిస్టెంట్ ప్రొఫెసర్ అంకం జయప్రకాశ్ శనివారం నియామకమయ్యారు. ఈయన ప్రస్తుతం కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పనిచేస్తున్నాడు. తెలంగాణ చరిత్ర పరిశోధనలో ముఖ్య భూమిక పోషిస్తున్న జయప్రకాశ్‌ను నియమించడంపై గ్రామస్తులు, స్నేహితులు కుటుంబ సభ్యులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

8న జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

పాతమంచిర్యాల: ఈనెల 8న జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని బాయ్స్ హైస్కూల్‌లో ఉంటాయని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అండర్–11, 13 విభాగాల్లో బాల,బాలికలకు సింగిల్స్, డబుల్స్ ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అండర్–15, 17, 19, పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్, మాస్టర్స్‌లలో 35 నుంచి 75 ఏళ్లలోపు వరకు పాల్గొనవచ్చని వివరించారు. పోటీల్లో పాల్గొనేవారు వయస్సు ధ్రువీకరణపత్రాలతో ఈనెల 8న ఉదయం 9 గంటలకు మంచిర్యాల హైటెక్ సిటీలోని మంచిర్యాల క్లబ్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఈపోటీల్లో ప్రతిభ కనబర్చినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేస్తారని తెలిపారు. ఈనెల 7 వరకు వారి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9849505695 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బస్టాండ్‌లో పర్సు చోరీ

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు ఎక్కుతున్న క్రమంలో ఆమె పర్సు చోరీ అయింది. బాధితురాలి కథనం ప్రకారం.. నిర్మల్ మండలం ఆలూర్‌కు చెందిన తిరుమల భైంసా మండలం కోతుల్‌గాంలో తన తల్లి వద్దకు వచ్చింది. శనివారం భైంసా బస్టాండ్‌కు వచ్చి నిర్మల్ వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా, గుర్తు తెలియని దుండగులు పర్సు దొంగిలించారు. అందులో రూ.3 వేల నగదు, రెండు తులాల వెండి వస్తువులు ఉన్నట్లు తిరుమల తెలిపింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొంది. తరచూ ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ ఘటనలు జరగడం ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తోంది. బస్టాండ్‌లో ప్రతీరోజు పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నా.. చోరీలు జరగడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు సైతం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా భద్రతాఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

శ్రీరాంపూర్‌లో వందశాతం ఉత్పత్తి

- ప్రగతి మైదానంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- జీఎం ఎం.శ్రీనివాస్



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: మే నెలలో శ్రీరాంపూర్ ఏరియా నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో వందశాతం సాధించిందని శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. మే నెలలో శ్రీరాంపూర్ ఏరియా గనుల్లో 5.53 లక్షల టన్నులు ఉండగా ఈ మొత్తాన్ని సాధించినట్లు తెలిపారు. ఏప్రిల్, మే నెలలకు కలిపి 11.6 లక్షల టన్నుల లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. ఆర్కే 7, ఆర్కే న్యూటెక్, ఎస్సార్పీ ఓసీపీలు వందశాతం ఉత్పత్తిని నమోదు చేసుకున్నాయని పేర్కొన్నారు. అత్యధికంగా ఎస్సార్పీ ఓసీపీ 122 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిందన్నారు. వర్షాల వల్ల 11 రోజులు ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిందన్నారు. ఈనెల 2 నుంచి శ్రీరాంపూర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను సింగరేణిలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి అక్కడి నుంచి కార్మికవాడల మీదుగా జీఎం కార్యాలయం వరకు బైక్, సైకిల్ ర్యాలీ ఉంటుందన్నారు. జయశంకర్‌సార్, తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి జాతీయ జెండా ఆవిష్కరణ చేస్తామన్నారు. సాయంత్రం ప్రగతి మైదానంలో వేడుకలు ఉంటాయన్నారు. వేడుకల్లో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఏజీఎం(ఫైనాన్స్) భిబత్సా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత

భీమిని: మండలంలోని బిట్టురుపల్లి వద్ద శనివారం ఆటోలో తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను శనివారం పట్టుకున్నట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి శనివారం వాహనతనిఖీలు చేస్తుండగా బెల్లంపల్లి నుంచి అనుమానాస్పదంగా ఆటోను తనిఖీ చేయగా 18 కిలోల నకిలీ పత్తి విత్తనాలతోపాటు రూ.50 వేలు నగదు లభించాయి. గజ్జెల సూర్యకాంత్‌ను అదుపులో తీసుకుని విచారించగా బెల్లంపల్లికి ప్రభుత్వ టీచర్ సుబ్బారావు వెంకటాపూర్, వడాల, నంబాల గ్రామాలకు సరఫరా చేయమని పంపినట్లు ఒప్పుకున్నాడు. వెంకటపూర్‌కు చెందిన కోట శ్రీనివాస్ నుంచి 18 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, రెబ్బెన మండలం నంబాలకు చెందిన రవిగౌడ్ నుంచి 8 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. మొత్తం రూ.1.54 లక్షల విలువ గల 44 కిలోల నకిలీ పత్తివిత్తనాలు, రూ.50 వేలతోపాటు ఆటోను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఏవో యమునదుర్గ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని కుసులాపూర్‌కు చెందిన జక్కుల వెంకన్న వద్ద నకిలీ పత్తి విత్తనాలను ఎస్సై రాధిక, ఏవో ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. జక్కుల వెంకన్న మహారాష్ట్ర నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకువచ్చారని టాస్క్ ఫోర్స్ టీమ్‌కు సమాచారం అందింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

మహిళ దృష్టి మళ్లించి బంగారం చోరీ


సీసీ ఫుటేజీలో పరిశీలిస్తున్న ఎస్సై గోపి

సోన్: మహిళ దృష్టి మళ్లించి రెండు తులాల బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన గంధం భూమన్న భార్య గంగామణి తమ అవసర నిమిత్తం శనివారం బైక్‌పై నిర్మల్‌కు వెళ్లి తిరిగివస్తున్నారు. గంజాల్ టోల్‌ప్లాజా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి వారి బైక్‌ను ఆపాడు. పోలీసునని హిందీలో చెప్పాడు. ముందు పోలీసులు బంగారం తనిఖీ చేస్తున్నారని చెప్పి కవరులో భద్రంగా దాచుకోవాలని సూచించాడు. మహిళ మెడలో బంగారం తీసి కవర్‌లో దాచారు. దొంగ తాను దాచిన కవర్లు వాళ్లకు చూపించి ఇలా దాచుకోవాలని చెబుతూ వారి కవర్ తీసుకుని పారిపోయాడు. దీంతో బాధితులు లబోదిబోమన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోన్ ఎస్సై కె.గోపి ఘటనస్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీలు పరిశీలించారు.

తాళం వేసిన ఇంట్లో..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధి న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిందని ప్రొహిబిషన్ ఎస్సై ప్రణయ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బిల్లు శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ఈనెల 29న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి, ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో రూ.3వేల నగదు, 3 తులాల వెండి ముంతను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎస్సై తెలిపారు.

మోటార్ సైకిల్ దొంగల ముఠా అరెస్ట్

నిర్మల్‌టౌన్: నిర్మల్, నిజామాబాద్ జిల్లాలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. రూరల్ సీఐ కృష్ణ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన మోషిన్‌ఖాన్, అవిజ్ చావుస్, మమ్మద్ సోఫియానుద్దీన్‌లు గతకొన్నిరోజులుగా నిజామాబాద్, నిర్మల్ జిల్లాలోని వివిధ చోట్ల మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. గతనెల 30న సాయంత్రం స్థానిక వైఎస్సార్ కాలనీలోని ఈడెన్‌గార్డెన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు పారిపోయే ప్రయత్నం చేశారు. రూరల్ ఎస్సై లింబాద్రి వారిని పట్టుకుని విచారించగా మోటార్ సైకిళ్లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు మోటార్ సైకిళ్లు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ కృష్ణ

క్లుప్తంగా

బాక్సింగ్ క్రీడాకారిణికి సాయం

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన అభినయ అనే బాక్సింగ్ క్రీడాకారిణి.. ఈనెల 4 నుంచి ఏడో తేదీ వరకు గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. శనివారం నర్సాపూర్‌లో అభినయను గ్రామీణ్ సపోర్టు ఫౌండేషన్ చైర్మన్ కదారి నరేశ్ సహకారంతో సన్మానించారు. అనంతరం ప్రయాణ ఖర్చుల నిమిత్తం క్రీడాకారిణికి రూ.ఐదు వేలను ఆర్థికసాయంగా అందించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, సభ్యుడు సుధాకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ శివారులోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. జ్యేష్ఠమాసం మొదటి శనివారం సందర్భంగా భక్తులు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర పూజలను అర్చకులు నరసింహస్వామి ఆధ్వర్యంలో జరిపించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడుకోవాలి



సరుకులు అందిస్తున్న కార్యదర్శి రాజబాపు

కుంటాల: ఊరిని శుభ్రం చేసే కార్మికులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపు పేర్కొన్నారు. శనివారం కుంటాలలో 12 మంది పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, మాస్కులు, సబ్బులు, చేతి గ్లౌజులు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

10న తైబజార్ బహిరంగ వేలం

భైంసాటౌన్: పట్టణంలో తైబజార్ నిర్వహణకు ఈనెల 10న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. రాజేశ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ 16 నుంచి మార్చి 31, 2026 సంవత్సరానికిగాను తైబజార్ వేలం ధర రూ.8 లక్షలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.10వేలు డీడీ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు దరఖాస్తు ఫారాలు మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని.. 9వ తేదీలోగా కార్యాలయంలో అందించాలన్నారు. పూర్తి వివరాలకు 63030 97039 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆయిల్ బాల్స్ తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంపీవో రత్నాకర్

ఖానాపూర్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీవో రత్నాకర్‌రావు.. సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామంలో దోమల నివారణలో భాగంగా ఆయిల్ బాల్స్ తయారు చేసి మురుగుకాల్వలో వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్ శకుంతలను సన్మానిస్తున్న రమణయాదవ్

కడెం: ఉత్తమ కమాండెబుల్ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్న కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శకుంతలను శనివారం బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోదాని రమణాయాదవ్ సన్మానించారు. పదోతరగతి, ఇంటర్‌లో విద్యార్థుల ఉత్తమ మార్కుల సాధనకు కృషి చేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం హర్షనీయమని పేర్కొన్నారు. గురుకులంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహేశ్‌యాదవ్, గంగన్న, రవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ధైర్యానికి ప్రతీక అహల్యాబాయి



ఖానాపూర్‌లో..



భైంసాలోని ఎస్ఎస్ కాటన్‌లో అహల్యాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



తానూరు మండలం జౌలా(బి)లో..



బాసరలో ..



మామడ మండలం కొరిటికల్‌లో..



ముధోల్‌లో..



సోన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

మరాఠీ రాణి, ధైర్యానికి ప్రతీక, పాలనదక్షురాలు, స్త్రీ శక్తిని నలుమూలల చాటిన వీరవనిత, మొగలులు ధ్వంసం చేసిన జ్యోతిర్లింగాలను పునరుద్ధరించిన అహల్యాబాయి హోల్కర్ భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఆమె 300వ జయంతిని జిల్లావ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాణి చిత్రపటానికి పూ లమాలలు వేసి నివాళులర్పించారు. నిర్మల్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితీశ్‌రాథోడ్ పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి నగేశ్వర్‌వాడ శివాలయం వరకు నాయకులు ర్యాలీ నిర్వహించి పూజలు చేశారు. హిందువులను జాగృతం చేసిన ఉక్కు మహిళగా ఆమెను పలువురు అభివర్ణించారు. – సాక్షి నెట్‌వర్క్



నిర్మల్ శివాలయంలో పూజలు చేస్తున్న నాయకులు



లోకేశ్వరంలోని వివేకానంద చౌరస్తా వద్ద..



కుంటాలలో..

15 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

- ఒక్కో వాహనానికి రూ.ఐదు వేల జరిమానా



సుద్దవాగు వద్ద తహసీల్దార్ హైమద్, ఎస్సై అశోక్

లోకేశ్వరం: అనుమతులు లేకుండా సుద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సర్ఫరాజ్ హైమద్ అన్నారు. శనివారం మండలంలోని సాత్‌గాం గ్రామ సమీపంలోని సుద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తీసుకెళ్తున్న 15 ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది, లోకేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో సుద్దవాగు వద్దకు వెళ్లి 15 ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున జరిమానా విధించామని వివరించారు. లోకేశ్వరం ఎస్సై అశోక్, ఆర్ఐ లలిత, పలువురు సిబ్బంది ఉన్నారు.

దెబ్బతిన్న పొలాలు పరిశీలన



వరి పరిశీలిస్తున్న ఏవో జగదీశ్వర్

ఖానాపూర్: మండలంలో అకాల వర్షాలతో నేల కొరిగి కోయలేని దుస్థితిలో ఉన్న వరి పొలాలను శనివారం ఏవో జగదీశ్వర్ పరిశీలించారు. శ్రీరాంనగర్ కాల్వ సమీపంలో భీమేశ్వర్, శ్రీనివాస్ తదితర రైతుల వరి పొలాలను పరిశీలించారు. రైతులు ముందుగా వరినాట్లు వేసుకుంటే సకాలంలో పంట చేతికొస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తే జైలుకు పంపిస్తాం

సారంగపూర్: నకిలీ విత్తనాలు, ఎరువులు అంటగట్టి రైతులను మోసం చేస్తే కేసులు నమోదు చేయించి జైలుకు పంపిస్తామని మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాలను తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్, ఏఓ వికార్ అహ్మద్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లో స్టాక్, రికార్డులు, ధరల వివరాలు పరిశీలించారు. రైతులు బిల్లులు తీసుకొని లాట్ నంబర్ వేయించుకోవాలని సూచించారు.

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ, చాక్‌పల్లి, బూర్గుపల్లి(కె) గ్రామాలో దుకాణాలను తనిఖీ చేశారు. ఎస్సై సాయికిరణ్, ఏవో రాంచందర్ నాయక్, ఏఎస్సై శంకర్, ఆర్ఐ సుమలత ఉన్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తహసీల్దార్ కమల్‌సింగ్, ఎస్సై అశోక్, ఏవో విక్రమ్ తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్, ధరల పట్టిక, లైసెన్స్, నిల్వలు తెలుసుకున్నారు. నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేసుకోవాలని యజమానులకు సూచించారు.

లక్ష్మణచాంద: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు



కనకాపూర్‌లో తనిఖీ చేస్తున్న సీఐ, అధికారులు

నమోదు చేస్తామని సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కనకాపూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తహసీల్దార్ సరిత, ఏవో వసంత్‌రావుతో కలిసి తనిఖీ చేశారు. ఎస్సై శ్రీనివాస్ తదితరులున్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను శనివారం ఎస్సై బిట్ల పెర్సిస్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ఎంఈవో రచన, ఆర్ఐ నారాయణరావు పాటిల్, అధికారులు ఉన్నారు.

బాసర: మండలకేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. గోదాంలలో నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఎంపీఓ రచన, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎస్సై శ్రీనివాస్,



సారంగపూర్‌లో స్టాక్ పరిశీలిస్తున్న అధికారులు



ముధోల్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై పెర్సిస్

అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండలకేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఏవో రాజశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఏఎస్సై భీంరావు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

‘ఐకేరెడ్డి.. ఎమ్మెల్యేపై విమర్శలు మానుకో’

నిర్మల్‌చైన్‌గేట్: మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి.. బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై విమర్శలు మానుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్మల్ నియోజకవర్గ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి రిటైర్మెంట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఐకే రెడ్డి మంత్రిగా పనిచేసిన హయాంలో ప్రజల సొమ్మును ఆయన బంధువులు, అనుచరులు దోచుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కమీషన్లు రాక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

మహేశ్వర్‌రెడ్డి చొరవతోనే కొనుగోళ్లు వేగవంతం..

ఎమ్మెల్యే చొరవతోనే వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యాయని.. ఇప్పటికే 99 శాతం కొనుగోళ్లు పూర్తయినట్లు బీజేపీ నాయకులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుంటే కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎమ్మెల్యే గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన మాజీ మంత్రి.. ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్మల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు.

ఎలా న్యాయ పోరాటం చేస్తారు.?

పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీ నీట మునిగితే



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సాకేర గ్రామ సమీపంలో స్వర్ణ నదిపై నిర్మించిన చెక్ డ్యాం ఎత్తు తగ్గించాలని ఎమ్మెల్యే.. మంత్రి దృష్టికి తీసుకువెళ్లారని గుర్తు చేశారు. అధికారులు సైతం ఇటీవల చెక్‌డ్యాం ఎత్తు తగ్గించారని దీనిపై ఎలా న్యాయపోరాటం చేస్తారో చెప్పాలని సవాల్ విసిరారు. పాక్‌పట్ల గ్రామ శివారులో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణానికి కమీషన్లు తీసుకుని తక్కువ ధరకు ప్రభుత్వ భూములు అప్పగించలేదా అని ప్రశ్నించారు. మహేశ్వర్ రెడ్డిపై అసత్యాలు మాట్లాడితే బీజేపీ నాయకులు చూస్తూ ఉండరని.. రాబోయే రోజుల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అలివేలు మంగ, రాచకొండ సాగర్, ఒడిసెల అర్జున్, ముత్యంరెడ్డి, చంద్రకాంత్, పొన్నం నారాయణగౌడ్, జమాల్, పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్, సుంకరి, బిట్లింగ్ నవీన్, సత్యనారాయణ, సాయి, మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు సుంకరి రాజేశ్, గిల్లి విజయ్, జుట్టు దినేశ్, ఈర్ల విజయ్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఆంక్షల్లేకుండా తడిసిన ధాన్యం కొనాలి

- నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సోన్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆంక్షల్లేకుండా కొనాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికే రైతులు నష్టపోతున్నారని.. కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి, హరీశ్ రెడ్డి, రాజనర్సయ్య, సుంచు నవీన్, మద్దెల గంగాధర్, గుర్రం నారాయణ, దినేశ్ పాల్గొన్నారు.

తూకంలో కోతలు విధిస్తే సహించం

సారంగపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో మోసం చేయడం, కోతలు విధించడం వంటివి



సోన్ మండలం కడ్తాల్‌లో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాండ్ర(జి), కంకెట, వైకుంఠాపూర్, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల సమస్యలను తెలుసుకున్నారు. రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

బాసర: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అశోక్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9:15 గంటలకు జరిగే కార్యక్రమానికి మండల ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో చేపట్టే నూతన రామాలయం నిర్మాణానికి శనివారం ఇద్దరు దాతలు విరాళాలను అందజేశారు. శ్రీరాంనగర్ కాలనీకే చెందిన కరిపె లక్ష్మి–రాజేశ్వర్ దంపతుల కుమారుడు రాజశేఖర్ రూ.5వేలు, నాంపెల్లి సువర్ణల–శ్యాంసుందర్ దంపతులు రూ.5116ను ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు భీమేశ్వర్, జనార్దన్, సాయి తదితరులు ఉన్నారు.

సన్మానం

బాసర: మండలకేంద్రంలో శనివారం గ్రంథాలయ కార్యనిర్వహణాధికారి టి.కిషన్ రావు ఉద్యోగ విరమణ పొందగా..ఆయన స్థానంలో ముధోల్ గ్రంథాలయ కార్యనిర్వహణాధికారి శంకర్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఇరువురిని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

కుంటాల: మండలంలోని కల్లూరు వీడీసీ కార్యవర్గాన్ని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నూతన కార్యవర్గాన్ని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్, దిగంబర పటేల్, సంతోష్‌రెడ్డి, దత్తాత్రి పటేల్, దిగంబర్ తదితరులు ఉన్నారు.

స్థల పరిశీలన

ముధోల్: మండలకేంద్రం శివారులో ప్లాస్టిక్ చెత్త రీసైకిలింగ్ కోసం శనివారం అధికారులు స్థలం పరిశీలించారు. సర్వే నెంబర్ 260లో 20గుంటల భూమిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, ఆర్ఐ నారాయణ్‌పటేల్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సీఐటీయూలో చేరిక

కడెం: మండలంలోని పాండ్వపూర్‌లో శనివారం అంబారిపేట్ సెక్టార్ పరిధి అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూలో చేరారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ సీఐటీయూతోనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. సీఐటీయూలో చేరిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్య, పద్మ, గంగామణి, కరుణ, సునీత, సుజాత, హేమవతి, రాధ, ప్రేమిత తదితరులున్నారు.

సీఐని కలిసిన నాయకులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మణచాంద ఎస్సై జి.శ్రీనివాస్‌ను శనివారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇరువురిని సన్మానించారు. ఇందులో బీజేపీ మండలాధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు అడ్వాల రమేశ్, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్, పోశెట్టి, రాంరెడ్డి, జీవన్ రెడ్డి, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

నర్సాపూర్ (జి): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలని ఏఈవో భాగ్యలక్ష్మి సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నంబర్ తీసుకురావాలని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం

లక్ష్మణచాంద: ఇటీవల బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్ సరితను శనివారం తన కార్యాలయంలో బీజేపీ నాయకులు, రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు అడ్వాల రమేశ్, రాంరెడ్డి, జీవన్‌రెడ్డి, రాజేశ్వర్, పోశెట్టి, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్, రేషన్ డీలర్లు పోశెట్టి, రాజేశ్వర్, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



బోనాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలకేంద్రంలో ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానవీధుల గుండా బోనాల ఊరేగింపుతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా పోతరాజుల విన్యాసం ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు కపిల్, పాతర్ల నారాయణ, గంగాధర్, యోగేశ్, నవీన్ ఉన్నారు.



ఆకట్టుకున్న విన్యాసం

3 నుంచి రెవెన్యూ సదస్సులు

మామడ: భూభారతి చట్టంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో ఈనెల మూడో తేదీ నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. డీటీ సంతోష్, ఆర్ఐ మెహరాజ్ హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల వారీగా సదస్సులు..

ఈనెల 3న మామడ, రాయదారి, 4న లింగాపూర్, నూసాంగ్వి, 5న దిమ్మదుర్తి,ఆరేపల్లి, 6న గా యిద్‌పల్లి, 9న నల్దుర్తి, బూరుగుపల్లి, 10న పులి మడుగు, వెంకటపూర్, 11న పొన్కల్, తాండ్ర, 12న పోతారం, రాశిమెట్ల గ్రామాల్లో నిర్వహించనుండగా 13న రాంపూర్, వాస్తాపూర్, అనంతపేట్ 16న పరిమండల్, కమల్‌కోట్, 17న కిషన్‌రావ్‌పేట్, ఆదర్శనగర్ 18న చందారం, టెంబుర్ని 19న బందలఖానాపూర్, కొరిటికల్, 20న కప్పన్‌పల్లి, న్యూలింగంపల్లి గ్రామాల్లో జీపీ కార్యాలయాలు, రైతువేదికల్లో సదస్సులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.